www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 10 | జూన్ | 2025 పేజీలు : 8





# కూనంనేనికే దక్కిన న్యాయ విజయం

-న్యాయస్థానంలో ప్రత్యర్థులకు భంగపాటు
-రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ, పేదల ఆనందోత్సవాలు





**ప్రజాపక్షం/ఖమ్మం :** 2023 నవంబర్ మాసంలో జరిగిన ఎన్నికల్లో ప్రజలు అపూర్వ విజయాన్ని అందిస్తే ప్రజల విశ్వాసాన్ని అపహాస్యం పాలు చేయాలని కొందరు ప్రయత్నించారు. ప్రజాభిమానం పక్షానే న్యాయం నిలబడుతుందన్న నానుడి నిజం చేస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కమ్యూనిస్టు వ్యతిరేకులను భంగపాటుకు గురి చేసింది. అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో కూనంనేనికి మరో విజయం దక్కింది. 2023 ఎన్నికల్లో కొత్తగూడెం నియోజక వర్గం నుంచి సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసిన కూనంనేని సాంబశివరావుకు నియోజక వర్గ ప్రజలు పట్టం కట్టారు. కూనంనేని ప్రజాభిమానం ముందు నిలబడలేక ఎన్నికల్లో చతికిలబడిన కొందరు ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుందని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ తర్వాత న్యాయస్థానం కూనంనేనిపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ సోమవారం తీర్పునిచ్చింది. దీనితో రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ శ్రేణులు, రైతు, కార్మిక వర్గాలు, పేదలు ఆనందోత్సవాలు వ్యక్తం చేశారు. పలు చోట్ల ర్యాలీలు నిర్వహించారు. కొత్తగూడెం నుంచి రెండవ దఫా శాసనసభ్యునిగా ఎన్నికైన తర్వాత అటు చట్ట సభల్లోనూ ఇటు ప్రజాబహుళ్యంలోనూ కూనంనేని ప్రజలకు తలలో నాలుకలా మారారు. ఒక పక్క మిత్రపక్షంగా వ్యవహరిస్తూనే ప్రజా సమస్యలపై ప్రశ్నలు ఎక్కుపెట్టడంలోనూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలోనూ ఎక్కడ రాజీ ధోరణిని అవలంభించకపోవడం కూనంనేని పట్ల ప్రజల్లో అమిత గౌరవం ఏర్పడింది. శాసనసభలో కూనంనేని మాట్లాడుతుంటే ప్రజలు హర్షిస్తున్నారు. సింగరేణి సమస్య మొదలు రైతాంగం, వ్యవసాయ కార్మికులు, విద్యార్థి యువజనులు, మహిళలు ఇలా సమస్య ఎవరిదైనా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి దాని పరిష్కారానికి కృషి చేయడంలో కూనంనేని కృతకృత్యులయ్యారు. అవసరమైనప్పుడు మద్దతునిస్తూనే ప్రశ్నించాల్సినప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య కూనంనేని వారధిలా మారారు. 18 మాసాల కాలంలో కూనంనేని పనితీరు రాజకీయాలకు అతీతంగా పలువురి ప్రశంసలు పొందింది. ఇటువంటి సమయంలో కోర్టు తీర్పు సోమవారం రాబోతుందని తెలిసి ప్రజలు ఒక్కింత ఆందోళనకు గురయ్యారు. ప్రజల పక్షాన నిలబడిన ప్రజా నాయకుని పట్ల తీర్పు ఏవిధంగా వస్తుందోనన్న ఆలోచన కొందరిలో కలిగింది. న్యాయస్థానం సానుకూల తీర్పునిచ్చిందని ప్రత్యర్థులు భంగపాటుకు గురయ్యారన్న వార్త తెలియగానే రాష్ట్ర వ్యాప్తంగా ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. కూనంనేని ఎన్నికకు సంబంధించి వెలువడిన తీర్పు భవిష్యత్తులో ప్రజాభిప్రాయాన్ని కాదని రకరకాల చిక్కులు సృష్టిస్తూ ప్రజలను గందరగోళానికి గురి చేసే వారికి ఈ తీర్పు గొడ్డలి పెట్టుగా మారింది. ఇదే సమయంలో ఈ తీర్పు కూనంనేని సాంబశివరావు బాధ్యతను మరింత పెంచింది. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ పట్టణాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. ఇది ప్రజా విజయంగా సిపిఐ, వివిధ సంఘాల నేతలు అభివర్ణించారు. ఈ తీర్పు పట్ల సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య, సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, వివిధ ప్రజా సంఘాల నేతలు, సింగరేణి కార్మిక సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పార్టీల నేతలు హర్షం వెలిబుచ్చారు.

# ప్రజా అవసరాలే ఎజెండా



-కుల గణన దేశానికి ఆదర్శం
-భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాలి
-మహానీయులను స్ఫూర్తిగా తీసుకోవాలి
-గౌడ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపనలో ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు పొన్నం, పొంగులేటి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఇందిరమ్మ రాజ్యం ప్రజా ప్రభుత్వంలో ప్రజల అవసరాలే ఎజెండాగా పాలన సాగిస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. మనం చేపట్టే పనులు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేవిధంగా ఉండాలని ఆయన తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండల పరిషత్ కార్యాలయ సమీపంలో గౌడ కులస్తుల కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రవాణా, బిసి సంక్షేమ

మిగతా 2లో..

# పేదలపక్షపాతి ఇందిరమ్మ ప్రభుత్వం

- అర్హులైన ప్రతీనిరుపేదలకు దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఏదులాపురంమున్సిపాలిటీ, ఖమ్మంరూరల్ మండలంలో పలురోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపనలు

2 లో



# విపత్తు నిర్వహణ సమన్వయంతో చేపట్టాలి




2 లో

- కలెక్టరేట్‌లో 1077 టోల్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు
-ఎస్‌డిఆర్‌ఎఫ్ పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్

# ప్రజా అవసరాలే ఎజెండా

(మొదటిపేజీ తరువాయి)

శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పిసిసి రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ లు పాల్గొని భూమి పూజ చేశారు. అనంతరం మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎన్ని అడ్డంకులు సృష్టించాలని చూసినా కులగణనను నిష్పక్షపాతంగా ఎటువంటి తప్పులు లేకుండా శాస్త్రీయబద్ధంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రధాని మోడీ సైతం దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టేందుకు తెలంగాణ కుల గణన ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజా అవసరాలను ఎజెండాగా చేసుకుని పాలన సాగిస్తున్నామని తెలిపారు. సంపదను పంచడంలో, సామాజిక న్యాయం పాటించడంలో జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. కుల గణన చేపట్టడంతో పాటు శాసనసభలో ప్రవేశపెట్టి బిల్లులను కూడా ఆమోదించడం జరిగిందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ కల్పించేవిధంగా బిల్లులను ఆమోదించడం జరిగిందన్నారు. మహానీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని వరంగల్ జిల్లాలో మారుమూల ప్రాంతంలో పుట్టిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సామాన్య వ్యక్తిగా జన్మించి రాజుగా వెలుగొందారన్నారు. అటువంటి మహానీయులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహంతో పాటు కమ్యూనిటీ హాల్ నిర్మాణం, కోచింగ్ సెంటర్ తదితర సౌకర్యాలను ప్రభుత్వ సహకారంతో సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు. మనం చేపట్టే పనులు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేవిధంగా ఉండాలని ఆయన తెలిపారు.

### చదువు ఎంతో ముఖ్యం : మంత్రి పొన్నం ప్రభాకర్

కుల వృత్తితో పాటు చదువు కూడా ఎంతో ముఖ్యమని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గౌడ కులస్తుల ఆత్మగౌరవం నిలిచేలా



ఖమ్మంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి , తుమ్మల నాగేశ్వరరావు, జిల్లాలోని ఎంపిలు, ఇతర ప్రజాప్రతినిధులు తమ నిధుల నుంచి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కొంత మేర నిధులు కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. సంవత్సర కాలంలోనే కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాల నుంచి వచ్చే పిల్లలు చదువుకునేవిధంగా గతంలో పెద్దలు హిమాయిత్ నగర్‌లో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టినట్లు పలు ప్రాంతాల్లోని ఆలయాల వద్ద కూడా సత్రాలను కూడా నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.

### సహాయ సహకారాలను అందిస్తాం : మంత్రి పొంగులేటి




గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం తరుపున సహాయ సహకారాలను అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం కృషి



చేస్తుందని ఆయన తెలిపారు.

### దేశం చూపు తెలంగాణ వైపు : పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్

యావత దేశం చూపు తెలంగాణ వైపు చూస్తుందని పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సారథ్యంలో కుల గణన పూర్తి చేసి అసెంబ్లీలో బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదించడం జరిగిందన్నారు. ఖమ్మంజిల్లా రాజకీయంగా ఎంతో పరిణితి చెందిందని తెలిపారు. కమ్యూనిటీ హాల్ పేదలకు ఉపయోగపడేవిధంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అందరికి సముచిత స్థానం కల్పిస్తుంని సామజిక న్యాయం పాటిస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో చేపట్టిన కుల గణన ఇప్పుడు దేశానికి ఆదర్శంగా నిలిచిందని ప్రధాని మోడీ సైతం దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టేందుకు సిద్ధమయ్యారని ఆయన తెలిపారు. ఏ కులంలో ఉన్న ఇతర కులాలను గౌరవించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎలు మట్టా రాగమయి, రాందాస్ నాయక్, రాష్ట్ర కార్పోరేషన్ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లె లక్ష్మ ణ్‌రావు గౌడ్, గౌడ సంఘం నేతలు అశోక్, బిచ్చాల తిరుమలరావు, డాక్టర్ రాజశేఖర్, బొల్లికొండ శ్రీనివాసరావు, కత్తి నెహ్రూ గౌడ్, బోయనపల్లి లక్ష్మ ణ్, బండి నాగేశ్వరరావు, బండి వెంకన్న, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలపక్షపాతి ఇందిరమ్మ ప్రభుత్వం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** పేదల పక్షపాతిగా ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రజాపాలన కొనసాగుతుందని రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఏదులాపురంమున్సిపాలిటీ, ఖమ్మంరూరల్‌మండలంల్లో పర్యటించి పలు రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని మద్దులపల్లిల్లో రూ.94లక్షల అంచనా వ్యయంతో ఖమ్మంసూర్యపేట ఆర్అండ్‌బి రోడ్డు నుండి ఆటోనగర్‌పొన్నెకల్లు డొంకవరకు నిర్మించనున్న బిటిరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.అలాగే మద్దుపల్లి డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు నివాస ధృవ పత్రాలను అందజేశారు. పొలెపల్లి నుండి రాజీవ్ గృహకల్ప కాలనీ ఎన్.ఎస్. కెనాల్ లాక్స్ వరకు రూ.2కోట్ల 86లక్షలతో నిర్మించనున్న బి.టిరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తెల్దారుపల్లి గ్రామం ఎస్‌సీ నివాసర ప్రాంతంలో రూ.50లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న 11అంతర్గత సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన ఎల్, బాబు, భారతి దంపతులు ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...రూ.50లక్షలతో నేడు అంతర్గత సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామన్నారు. వీటిని మరో 10రోజులలో పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో 21లక్షల రూపాయల విలువల గల సిసిరోడ్లను గ్రామంలో నిర్మించామని మంత్రి గుర్తు చేశారు. ముత్యాలమ్మగుడి నుంచి దోబీఘాట్ వరకు, ఖమ్మం నుంచి కోదాడ తెల్ధారుపల్లి, తెల్ధారుపల్లి నుంచి రాముడి చెరువు, తెల్ధారుపల్లి నుంచి తల్లంపాడు వరకు 10కోట్ల50లక్షల రూపాయలతో 4రోడ్లు మంజూరు చేసామన్నారు. 81లక్షల రూపాయలతో ఖమ్మం నుంచి తెల్ధారుపల్లి వరకు రోడ్డు మరమ్మత్తుల పనులు పూర్తి చేసామన్నారు. 20లక్షల రూపాయలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏరాపటు చేశామన్నారు. అలాగే నీటిపారుదల శాఖ సంబంధిత రెండు పనులు పూర్తి చేశామని, త్రాగు నీటి ఇబ్బందులు పరిష్కరించామన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదల కోసం గతంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూ ఆర్థిక పరిస్థితి బాగు చేస్తూ నూతనంగా 200యూనిట్ల ఉచిత విద్యుత్, 500గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం సరఫరా, సన్న వడ్లకు క్వింటాళ్ల 500బోనస్, రైతు భరోసా 12వేల రూపాయలకు పెంపు, 21వేల కోట్ల రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్ల వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామంలో 60 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని గత పాలకులు విస్మరించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను కూడా పూర్తి చేస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి విడతల వారీగా ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే బాధ్యత ఇందిరమ్మ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. పేదలకు అండగా ఉండే ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, ఆర్డీఓ నరసింహారావు, తహశీల్దార్ రాంప్రసాద్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు మద్ది మల్లారెడ్డి, ధరావత్ రామ్మూర్తినాయక్, కాంగ్రెస్ యువజన నాయకులు తమ్మినేని నవీన్, మండల అధ్యక్షుడు కళ్లె వెంకట్‌రెడ్డి, మద్ది వీరారెడ్డి, ఏటుకూరి సుధాకర్, యువజన సంఘం సభ్యుడు అంటి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మమాట అగన్వాడీ బాటను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఈనెల 10 నుండి 17వ తేది వరకు జరిగే అమ్మమాట అగన్వాడీ బాట కార్యక్రమాన్ని జయప్రథం చేయాలని జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా అన్నారు. ఈ మేరకు సోమవారం సిబ్బందితో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేలా చూసుకోవాలన్నారు. తల్లిదండ్రులతో అంగన్వాడీ సెంటర్ల వద్ద సెల్ఫీపాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్పోరేట్ విద్యా సంస్థలకు ధీటుగా విద్యాబోధన చేస్తున్న తీరుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పోషక వాటికలు ఏర్పాటు చేయాలని, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించాలని, విద్యాభ్యాసంలో ముందంజలో ఉన్న పిల్లలకు ప్రోత్సాహకాలు అందించాలన్నారు.

## విపత్తు నిర్వహణ సమన్వయంతో చేపట్టాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విపత్తు నిర్వహణ కార్యక్రమాలను సమన్వయంతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో విపత్తుల నిర్వహణపై అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి సంబంధిత ఎస్‌డిఆర్‌ఎఫ్ పోలీస్ అధికారులతో సమీక్షించారు. గతేడాది వచ్చిన భారీ వరద, తీసుకున్న చర్యలు, తదితర అంశాలను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పుడు రానివిధంగా గతేడాది భారీ స్థాయిలో వరద వచ్చిందన్నారు. 2023లో వచ్చిన 24 అడుగుల వరద అతిపెద్దది అనుకుంటే 2024 సంవత్సరంలో 40అడుగుల వరద వచ్చిందన్నారు. ఆ సమయంలో సామాజిక మాధ్యమాల్లో చాలా మేరకు తప్పుడు ప్రచారాలు జరిగాయన్నారు. ఖమ్మంజిల్లాలో వరద ఉధృతి అధికంగా ఉండటం, ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ముందుగా లేకపోవడం, ప్రజలు ముందుగా వరద ఉధృతి ఊహించకపోవడం వంటి అనేక కారణాల వల్ల చాలా ఇబ్బందులకు గురయ్యామని కలెక్టర్ తెలిపారు. పాత తప్పులు పునరావృతం కాకుండా ఖమ్మంజిల్లాలో వరద పరిస్థితులపై అప్రమత్తంగా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో కురిసే వర్షం వివరాలను కూడా ట్రాక్ చేస్తూ మున్నేరు, ఇతర నదుల ప్రవాహాల వివరాలను వాట్సప్ గ్రూపుల ద్వారా జిల్లా అధికారులకు ఎప్పటికప్పుడు అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము 1077 నెంబర్‌తో ఏర్పాటు చేశామన్నారు. 380 మంది సామాన్య ప్రజలకు శిక్షణ అందించి ఆపద మిత్రలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్థాయిలో ఆపద మిత్రలు పంచాయతీ కార్యదర్శి, విద్యుత్, నీటిపారుదల శాఖ, ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ టీచర్‌లతో డిజాస్టర్ టీం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే బుధవారం నాడు మాక్‌డ్రిల్ వంటి కార్యక్రమం నిర్వహించి విపత్తు సమాచారం క్షేత్రస్థాయికి చేరుతుందో లేదో పరిశీలిస్తామన్నారు. ప్రతి గ్రామంలో గత ఈతగాళ్లను గుర్తించామని, మండలంలో అవసరమైన బోట్, ఇతర సామగ్రి అందుబాటులో పెడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో పర్యటించి ముందుగా వారి పరిధిలోని వల్నరబుల్ ప్రాంతాలు, శిథిలావస్థకు ఉన్న ఇండ్లు, ఒంటరి మహిళలు, వృద్దులు, వివిధ బలహీన వర్గాల ప్రజలు ఉన్న లోతట్టు ప్రాంతాలను, ఆపద సమయంలో ఏర్పాటు చేయాల్సిన రిలీఫ్ సెంటర్‌ను ముందుగానే గుర్తిస్తున్నామని, అక్కడ అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలకు నేరుగా జిల్లా కలెక్టర్ నుంచి కాంటాక్ట్ అవుతామన్నారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలకు అవసరమైన పరికరాలు, సేఫ్టీ మేటీరియల్, ఇతర అంశాలపై సమాచారం అందిస్తే వాటిని అందుబాటులో పెడతామని తెలిపారు. విపత్తు సమయంలో వినియోగించే పరికరాలు ముందుగా వాడి మనకు అలవాటు చేసుకోవాలన్నారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం సభ్యులు ఖమ్మంజిల్లాలో గతంలో అధికంగా వచ్చిన వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు కూడా కొంత అవగాహన కల్పించాలన్నారు. కొత్తగూడెం ఆరవ బెటాలియన్ అధికారి డి. శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ 98మంది వరకు రాష్ట్ర స్థాయిలో విపత్తు నిర్వహణ పట్ల శిక్షణ పొందారని వీరికి అవసరమైన పరికరాలపై జాబితా అందిస్తామన్నారు. విపత్తు సమయంలో వచ్చి అవసరమైన సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం అసిస్టెంట్ కమాండెంట్ డి. శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐలు శ్రీవాస్తవ్, శ్రీకాంత్, సురేష్, ఆర్ఐ జానయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలు వెంటనే పరిష్కరించాలి

**-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి అర్జీలను స్వీకరించారు. ఖమ్మం కాల్వొడ్డులోని హిందూ స్మశానవాటిక నిర్వహణ కమిటీ ఖమ్మం మున్నేరు నదిపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో తమకు చెందిన 14 షాపులను తొలగించారని వీటి ద్వారా వచ్చే ఆదాయంతో మధ్యాహ్న భోజనం, ఐ బ్యాంక్ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఇట్టి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన పగడం దేవకర్ణ తాము కరోనా సమయం నుంచి స్వీపర్‌గా పని చేస్తున్నామని తనను నేడు విధుల నుంచి తొలగించారని ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. కొణిజర్ల మండలం కంకణాల నవ్యతాను ఎస్సి మాదిగ కులానికి చెందినానని ఇటీవల 10వ తరగతి ఉత్తీర్ణత సాధించానని గురుకుల పాఠశాలలో ఇంటర్ చదివేందుకు ప్రవేశ పరీక్షలో ఎప్లస్ గ్రేడ్ వచ్చిందని తనకు హైదరాబాద్‌లో సీటు వచ్చిందని ఖమ్మంజిల్లాలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. చింతకాని మండలం నరసింహాపురం గ్రామానికి చెందిన ఎల్.సుగుణ తన భర్త ఎల్. ముత్తయ్య 2010లో మరణించారని గతంలో తనకు ఆపద్బంధు పథకం మంజూరైందని దానిని వర్తింపజేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా సంబంధిత దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, డిఆర్‌డివో సన్యాసయ్య, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ మండల మహాసభను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/ ఖమ్మం : ఈ నెల11న ముష్టికుంట్లలో జరిగే సిపిఐ మండల మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు కోరారు. సోమవారం మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ సిపిఐ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాల కాలంలో అప్పటి నుండి ఇప్పటి వరకు అనేక ప్రజా పోరాటాలు చేసిందని, వందేళ్ళ చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో సిపిఐ కీలక పాత్ర పోషించిందని, అదేవిధంగా ప్రజలతో మమేకమై ఆనాటి నైజాం నవాబులకు వ్యతిరేకంగా పోరాడి ఆనాడు తెలంగాణ సాధించుకున్న చరిత్ర సిపిఐకి ఉందన్నారు. అలాగే భూ పోరాటాలు నిర్వహించి ప్రజలకు భూములు పంచిపెట్టిందన్నారు. బోనకల్ మండల సమగ్ర అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు శక్తివంచన లేకుండా సిపిఐ కృషి చేస్తుందన్నారు. మూడు సంవత్సరాల ఒకసారి జరిగే మహాసభల్లో సిపిఐ చేపట్టిన కార్యక్రమాలు సమీక్షించుకోవడంతో పాటు భవిష్యత్ పోరాటాల కార్యాచరణ ప్రణాళిక రూపొందించటం జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు హాజరవుతారని, అధిక సంఖ్యలో సిపిఐ శ్రేణులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆకెన పవన్, శాఖ క్యార్యదర్శి బోడ్డుపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు కొంగర భాస్కర్‌రావు, కాకటి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడంతో ప్రైవేట్ కార్పోరేట్ విద్యా సంస్థలు అడ్మిషన్ల ముసుగులో ఫీజుల మోత మోగిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించి సీజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం నగరంలోని గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మదు పల్లి లక్ష్మణ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రైవేట్ కార్పోరేట్ విద్యా సంస్థల యజమాన్యాలు అనుమతులు లేకుండానే అడ్మిషన్లు చేస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కార్పోరేట్ విద్యా సంస్థలు ఫీజుల మోతలు మోగిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి చోద్యం చూస్తున్నారే తప్ప గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించి ఆయా పాఠశాలలపై తగు చర్యలు తీసుకోవడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. విద్యను సంతలో సరుకుగా మార్చేశాయన్నారు. ఎస్టియు జిల్లా కార్యదర్శి షేక్ కరామత్ అలీ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, టిటిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వర రావు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు లు మాట్లాడుతూ అడ్మిషన్లు తీసుకుంటే డొనేషన్లు, పుస్తకాలకు, యూనిఫాంకు వేరే ఫీజులు వసూలు చేస్తూ దందాకు పాల్పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ కార్పోరేట్ పాఠశాలల్లో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు 25 శాతం రాయితీ ఇవ్వాలని నిబంధనలు ఉన్న ఆ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని వారు డిమాండ్




చేశారు. మరో వైపు జిల్లాలో ఇంటర్నేషనల్ స్కూల్ పేర్లతో నర్సరీ, ఎల్ కెజి, యుకెజి లకు లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. ప్రైవేట్ కార్పోరేట్ విద్యా సంస్థల్లో చదివించాలనే తల్లిదండ్రుల ఆశను ఆసరాగా మలచుకున్న కార్పోరేట్ ప్రైవేట్ విద్యా సంస్థల యజమాన్యాలు ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి జిల్లాలో ఇంటర్నేషనల్ స్కూల్ పేర్లతో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కార్పోరేట్ విద్యా సంస్థల యజమాన్యాలపై క్రిమినల్ కేసులు బనాయించి ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వారు పేర్కొన్నారు. వామపక్ష విద్యార్థి యువజన మహిళా సంఘాలు, ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుడుం ప్రవీణ్, సుధాకర్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, లక్ష్మణ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్, జ్వాల్దరెడ్డి పిడిఎస్‌యు మంద సురేష్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏపూరి లతాదేవి, పోటు కళావతి, ఐద్వా జిల్లా నాయకురాలు బేగం తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మధు, శివనాయక్, మనోజ్, గోపి, హరికృష్ణ, రాకేష్, ప్రతాప్, పవన్, శ్యామల, నరేందర్ పాల్గొన్నారు.

# ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను నిలుపుదల చేయాలని వినతి




ప్రజాపక్షం/ ఖమ్మం : మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను నిలుపుదల చేయాలని టిఎస్ యూటిఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డే తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా టిఎస్‌యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ మాట్లాడుతూ ముష్టికుంట్ల గ్రామంలో ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలుపుదల చేయకపోవడం వలన ఖమ్మం నుంచి వచ్చే ఉపాధ్యాయులు, ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అవుతుందని, ఇప్పటికైనా ఆర్టిసి అధికారులు స్పందించి ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు చిన్న రంగారావు, మండల ఆడిటర్ పి.నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

ప్రజాపక్షం/ఖమ్మం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఇఓ దామాల పుల్లయ్య అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచేందుకు టిఎస్‌యూటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. సోమవారం టిఎస్‌యూటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమాన్ని, బైక్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నమోదుశాతం పెంచి పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న ఉచిత విద్యను ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎస్‌యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, జిల్లా నాయకులు సద్దా బాబు, మండల అధ్యక్షులు చిన్న రంగారావు, కోశాధికారి జిల్లా కోటయ్య, ఉపాధ్యక్షులు.పిగోపాల్‌రావు, మండల కార్యదర్శులు కె.నిర్మల, కె.సురేష్, అల్వాల నాగేందర్, మండల ఆడిటర్ పి.నర్సింహారావు, నాయకులు పాల్గొన్నారు.

# పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

**-ఏడుగురు అరెస్ట్**

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి ఏడుగురిని అరెస్ట్‌చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసిపి రవి కథనం ప్రకారం చింతకాని మండలం రామకృష్ణపురం గ్రామ సమీపంలో కొందరు పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఖమ్మం టాస్క్‌ఫోర్స్, చింతకాని పోలీసులు దాడులు చేసి ఉయాలా శ్రీను, ఎస్‌కె రహీం, పగిళ్ల శివరామకృష్ణ, గంటాలా రవీంధ్ర, నకులూరి రామారావు, మాండా సాయికిరణ్, ఎస్‌కె మస్తాన్ లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 19 వేల రూపాయల నగదు, 7 బైక్‌లు, 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలపారు. వారిపై తెలంగాణ స్టేట్ గేమింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలపారు. చట్టవ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# అశ్వారావుపేటను మున్సిపాలిటీగా మార్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే..



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట అభివృద్ధిలో భాగంగా నూతన మున్సిపాల్టీగా ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం మన మున్సిపాల్టీ మన అభివృద్ధిపై స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌజ్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు గ్రామపంచాయతీలను కలిపి కొత్త మున్సిపాల్టీగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. నూతన మున్సిపాల్టీ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు.అశ్వారావుపేట మున్సిపాల్టీ అభివృద్ధికి రూ.15కోట్లు నిధులతో ప్రణాళిక రూపొందించి అభివృద్ధి దిశగా ముందుగు సాగుతున్నామని తెలిపారు. తాగునీరు సరఫరా, రహదారులు, విద్యుత్ వ్యవస్థ, ఆరోగ్యం, విద్యా సదుపాయాలతో పాటు అన్ని రంగాల అభివృద్ధిపై దృష్టి పెట్టనున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యం, సహకారం వల్లే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. నూతన మున్సిపాల్టీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కకి, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, స్థానికులు, మండలస్థాయి నాయకులు, అఖిలపక్షాలు ఈ సదస్సులో పాల్గొనగా మున్సిపాల్టీ అభివృద్ధిపై ముఖ్యమైన సలహాలు, సూచనలు సేకరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సుజాత, తహశీల్దార్ రామకృష్ణ, టిపిఓ వి.శ్రీనివాసరావు, సిఐ నాగరాజు, ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# పేద ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేయాలి



ప్రజాపక్షం/ తల్లాడ : ఆర్యవైశ్యుల్లో పేదలు ఉన్నారని, వారికి కూడా ప్రభుత్వ పథకాలు వచ్చే విధంగా చూసి వారి అభ్యున్నతికి కృషి చేయాలని తల్లాడ మండల నాయకులు కోరారు. ఆదివారం రాత్రి ఖమ్మంలో జరిగిన ఆర్యవైశ్యసంఘం జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారమహోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతను నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేద ఆర్యవైశ్యులకు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం తదితర పథకాలు కూడా వచ్చే విధంగా చూడాలన్నారు. దీనికి స్పందించిన ఆమె ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా అధ్యక్షులుగా నియామకమైన పసుమర్తి చందర్‌రావును శాలువాలతో సన్మానించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు కేతేపల్లి భాస్కర్‌రావు, జిల్లా కార్యదర్శి దారా శ్రీనివాసరావు, నంబూరు కనకదుర్గ ప్రసాద్, దారా విష్ణుమోహన్‌రావు, జవ్వాస్ నాగేష్, మిట్టపల్లి కృష్ణ, దారా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు మంత్రి పొంగులేటి అభయహస్తం

**పిఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థికసాయం**



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పాలేరు నియోజకవర్గంలో వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుంబాలకు రూ.10వేలు చొప్పున పిఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందించారు. ఆర్థిక సాయం అందిస్తానని ఇచ్చిన మాట ప్రకారం మే మొదటి తేదీ నుండి మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు, పాపాయిగూడెం, తిప్పాలరెడ్డి, పాతర్లపాడు, బీరురోలు, జూపెడ, మేడితపల్లి, కాకరవాయి గ్రామంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలకు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యక్తిగత సహాయకులు తంబూరు దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా రూ.10వేలు చొప్పున సోమవారం పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, బెల్లం శ్రీనివాస్, మాజీ ఎంపిపి బోడ మంగీలాల్‌నాయక్, పాలేరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మద్దులపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి, డైరెక్టర్ జడల నగేష్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 14న జరిగే మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి




**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఈ నెల 14న మధిర కోర్టులో జరిగే మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎర్రుపాలెం ఎస్సై రమేష్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాక్సిడెంట్ , కొట్టుకున్న కేసులు, చిట్ఫండ్ కేసులు, భూతగాదాలు, వివాహ సంబంధించిన కేసులు, చిన్నచిన్న దొంగతనాల కేసులు ఈ లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు. కక్షిదారులు తప్పనిసరిగా ఫిర్యాదుదారుడు, నేరస్తుడు ఇద్దరు తమ ఆధార్ కార్డులు తీసుకుని మధిర కోర్టుకు రావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఘనంగా 'జయ'డెంటల్ హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం

**- కేక్ కట్ చేసి వేడుకను ప్రారంభించిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లోని(డిబిఆర్‌సర్కిల్) అన సూర్యక్యాంప్లెక్స్‌లో గల జయ డెంటల్ హాస్పిటల్ మొదటివార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దీనికి సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యి ఏర్పాటు చేసిన కేక్‌ను హాస్పిటల్ నిర్వాహకులతో కలిసి కట్ చేశారు. తొలుత ఆయనకు హాస్పిటల్ డాక్టర్ బి. విజయ, ఆమె భర్త తారాసింగ్ పుష్పగుచ్చాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సమితి సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, సిపిఐ 28వ డివిజన్ కార్యదర్శి లగిశెట్టి రమేష్, 29డివిజన్ కార్యదర్శి వెంపటి రాము, 30వ డివిజన్ కార్యదర్శి బియ్యాల రాజు, ఏఐవైఎఫ్ 30వ డివిజన్ కార్యదర్శి బంక అశోక్, డివిజన్ సభ్యులు కోటా శ్రీనివాస్‌రెడ్డి, పానమాకులు కృపాకర్, పభాకర్, మామిండ్ల అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో కార్యదర్శి, భానోతు సోనాలి మృతి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలం రామచంద్ర రావు బంజర్ గ్రామ పంచాయితీ కార్యదర్శి భానోతు సోనాలి సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్వగ్రామం కల్లూరు మండలం, లక్ష్మాతండా నుండి విధి నిర్వహణకు రామచంద్రరావు బంజర్ స్కూటీ పై వస్తుండగా వియం. బంజర్ గ్రామంలో ఖమ్మం రోడ్డు లోని ప్రాథమిక పాఠశాల ఎదురుగా పైపులు లోడుతో వెళుతున్న లారీ ఢీ కొట్టి ఆమె పై నుండి వెళ్లడంతో ఘటనా స్థలంలో దుర్మరణం చెందింది. వియం. బంజర్ పోలీస్‌లు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వియం. బంజర్ ఎస్ఐ కే వెంకటేష్ దర్యాప్తు చేపట్టారు.

# వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి పనులపై కలెక్టర్‌కి వినతి



**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి పనులు గురించి గ్రీవెన్స్‌డే సందర్భంగా ఖమ్మం కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌కి వినతిపత్రం ఇచ్చిన స్థానిక వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నవీనజ్యోతి తెలిపారరు. గతంలో వైరా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సమస్యల పరిష్కారం కోసం హామీలు ఇవ్వడం జరిగిందని, అందులో భాగంగా కళాశాల ఖాళీ స్థలంలో నుంచి వెళుతున్న కరెంటు తీగలను, విద్యుత్ ట్రాన్స్‌ఫారం గమనించి వాటిని మార్చాల్సిందిగా సంబంధిత అధికారులు ఆదేశించగా సంబంధిత అధికారులు వాటిని మార్చడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా అసంపూర్ణంగా ఉన్న తరగతి గదుల నిర్మాణం గురించి, కళాశాల టాయిలెట్స్ నిర్మాణం గురించి కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. ఈస ందర్భంగా కలెక్టర్ ఈ సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించి త్వరలో వీటి పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

# పదవివిరమణ పొందిన ఎస్సై దంపతులకు సన్మానం



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో స్థానిక కామిశెట్టి కళ్యాణ మండపం నందు ఇటీవల ఎస్సైగా బాధ్యతలు నిర్వహించి పదవివిరమణ పొందిన ఎం.సిల్వరాజు, విజయ దంపతులను టిపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, నాయకులు కట్ల సంతోష్, రేచర్ల నాగేశ్వరరావుల పూలమాలలు వేసి శాలువాతో సత్కరించడం జరిగింది. విధి నిర్వహణలో పోలీస్‌శాఖలో వివిధ హోదాల్లో సిల్వరాజు విధి నిర్వహణలో మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నారని కొనియాడారు.

# టిప్పర్ కిందకు దూసుకెళ్లిన వీఆర్ఎ

**తీవ్ర గాయాలు...ఖమ్మం తరలింపు**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** విధి నిర్వహాణ కోసం వెళ్తుండుగా... వీఆస్ఏ ప్రమాదవశాత్తు ఓ టిప్పర్ కిందకు దూసుకెళ్లాడు... తీవ్ర గాయాలు కావటంతో ఖమ్మం తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని బైరవునిపల్లి గ్రామానికి చెందిన గ్రామ రెవిన్యూ సహాయకులు (వీఆర్ఎ) పర్వత రాముడు తహాశీల్దార్ కార్యాలయం కు విధి నిర్వహాణ లో భాగంగా టీవీఎస్ (ఎక్స్ ఎల్) పై వెళ్తున్నారు. స్థానిక పవర్ ప్లాంట్ సమీపంలో మూలమలుపు వద్ద ఓ టిప్పర్ రివర్స్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో టిప్పర్ కిందకు దూసుకెళ్లింది. తృటిలో పెనుప్రమాదం తప్పింది. అటు గా వెళ్తున్న బాటసారులు గమనించి కేకలు వేయటంతో టిప్పర్ డ్రైవర్ అప్రమతం కావటంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. తీవ్ర గాయాలైన రాముడు ను మెరుగైన వైద్యం కోసం ఖమ్మంతరలించారు.

# రూ.23వేల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌కు చెందిన పొన్నం ప్రసాద్‌కు రూ.23వేల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరయ్యింది. బాధితుడు అనారోగ్య ఖర్చుల నిమిత్తం సిపిఐ పార్టీ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ సహకారంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సిఫారస్ ద్వారా లభించింది. కాగా అక్కడ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో లబ్ధిదారుడికి ఇంటి వద్దకు వెళ్లి సోమవారం భార్య కుమారికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సమితి సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, సిపిఐ 28వ డివిజన్ కార్యదర్శి లగిశెట్టి రమేష్, 29వ డివిజన్ కార్యదర్శి వెంపటి రాము, 30వ డివిజన్ కార్యదర్శి బియ్యాల రాజు, ఏఐవైఎఫ్ 29వ డివిజన్ కార్యదర్శి మిర్యాల నరుణ్‌తేజ్, 30వ డివిజన్ అధ్యక్షుడు దైథా జేమ్స్, కార్యదర్శి బంక అశోక్, సోషల్‌మీడియా ఇంన్చార్జ్ రెబ్బగొండ్ల గోపి, డివిజన్ సభ్యులు కోటా శ్రీనివాస్‌రెడ్డి, బుద్ధి రాధాకృష్ణ, మామిండ్ల అశోక్‌రెడ్డి, పానమాకుల కృపాకర్, అవినాష్, యువజన సంఘం సభ్యులు చింతల ఉదయ్, మేదరమట్ల రోషన్ తదితరలు పాల్గొన్నారు.

# అవసరం మేరకే రసాయలను వినియోగించాలి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** పంట సాగులో అవసరం మేరకుమాత్రమే రసాయనాలను వినియోగించాలని వైరా కృషి విజ్ఞానన కేంద్రం ప్రోగాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ రైతులకు సూచించారు. సోమవారం ఖమ్మంరూరల్ మండలంలోని గోళ్లపాడు రైతు వేదికలో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ, వైరా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...తక్కువ యూరియా వాడంటం ద్వారా సాగు ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. పంట వ్యర్థాలను తగలబెట్టకుండా పొలంలోనే కలియదున్నుకోవాలన్నారు. ఇలా చేడం ద్వారా భూమికి బలాన్నిచ్చే సూక్ష్మ జీవులు బ్రతికి పంట పెరుగుదలకు దోహదపడతాయన్నారు. అనంతరం రైతులకు పలు అంశాలపై అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకులు నల్లమల్ల వెంకటేశ్వరరావు, కూసుమంచి డివిజన్ ఏడిఏ బి.సరిత, ఏఓ ఉమనాగేష్, వెటర్నరీ డాక్టర్ జగ్గులాల్, శిక్షణకేంద్రం సభ్యులు భాస్కర్, శరత్, ఉద్యానవనశాఖ అధికారిని అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

# మల్లారంలో ఇద్దరు సిపిఐ సీనియర్ సభ్యుల మృతి



ప్రజాపక్షం/ఖమ్మం : మధిర మండలం మల్లారం గ్రామంలో ఇద్దరు సిపిఐ సీనియర్ సభ్యులు సోమవారం మృతిచెందారు. సుదీర్ఘ కాలం పాటు ఎర్రజెండా నీడన ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగిన పలు ఆందోళనల్లో వారు పాలుపంచుకున్నారు. మల్లారం గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ విస్తృతి కోసం విశేష కృషి చేశారు. సుదీర్ఘ కాలం పాటు కమ్యూనిస్టు పార్టీలో పనిచేసిన ఎర్రనాగుల హన్మంతు (60) అనారోగ్యంతో మృతి చెందారు. హన్మంతుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సిపిఐలో పనిచేస్తూ కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కృషి చేసిన అరిగెల నారాయణ (70) సోమవారం మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతి వార్త తెలిసిన వెంటనే సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, మందడపు రాణి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, సిపిఐ నాయకులు పోటు పూర్ణచందర్‌రావు, సిపిఐ మల్లారం గ్రామ శాఖ కార్యదర్శి పరుచూరి రాము తదితరులు వారి పార్థివ దేహాలపై అరుణ పతాకాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. నివాళులర్పించిన వారిలో గరిడేపల్లి వెంకటేశ్వర్‌రావు, దాసరి ప్రకాషరావు, మందడపు మురళి, కొంగర మురళి, దాసరి సురేష్ తదితరులు ఉన్నారు.

# సీతారాం ప్రాజెక్టు నీళ్లు మన జిల్లాకి అందించాలి



ప్రజాపక్షం/ఖమ్మం : సీతారాం ప్రాజెక్టు నీళ్లు మన జిల్లాలోని ఐదు నియోజకవర్గ రైతాంగానికి అందించాలని మాజీ జిల్లా అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పార్టీ శ్రేణులు, రైతులు కలిసి భారీ వాహనర్యాలీ నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రం ఏర్పాటైన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి వద్ద సీతారాం ప్రాజెక్టు, సీతమ్మసాగర్ ఎత్తిపోతల పథకాన్ని నెలకొల్పి దాదాపు 90శాతం పనులు పూర్తిచేస్తే నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత మాటలతో కాలయాపన చేయడం దౌర్భాగ్యమని ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగునీరు ఇవ్వడం సమంజసమేనని, జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారని, వారు రాష్ట్రానికి మంత్రులా..ఖమ్మం జిల్లాకే మంత్రులా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖమ్మం మార్కెట్‌లోకి ఆల్ న్యూ అల్ట్రోజ్ విడుదల




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్: ప్రముఖ కార్ల తయారీ సంస్థ టాటా మోటార్స్ తమ ప్యాసింజర్ కారు విభాగంలో సక్సెస్ అయిన అల్ట్రోజ్‌ను అప్‌గ్రేడ్ చేసి సరికొత్తగా రూపొందించిన ఆల్ న్యూ అల్ట్రోజ్‌ను అధీకృత డీలర్ వెంకటరమణ మోటార్స్ ద్వారా ఖమ్మం మార్కెట్‌లోకి ఖమ్మం ఏసిపి ఎస్‌వి రమణమూర్తి విడుదల చేశారు. సోమవారం అధీకృత డీలర్ వెంకటరమణ మోటార్స్‌లో జరిగిన కార్యక్రమంలో న్యూ అల్ట్రోజ్‌ను ఏసిపి రమణమూర్తి విడుదల చేశారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ ఆల్ న్యూ అల్ట్రోజ్ సిక్స్ ఎయిర్ బ్యాగ్స్‌తో సేఫ్టీ పరంగా బాగుందన్నారు. ప్రతి ఒక్కరూ సీటుబెల్ట్ లేకుండా నడప వద్దని తెలిపారు. కంపెనీ వారు ఇచ్చిన మ్యానువల్ ప్రకారం కారు నడ పాలని, ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. వివిసి గ్రూప్ సంస్థల ఎండి వివి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అల్ట్రోజ్ 2020లో మార్కెట్‌లోకి వచ్చిందని వినియోగదారుల అభిప్రాయాలు, సూచనల మేరకు మరింత మెరుగైన ఫీచర్స్, ఇంటర్నేషనల్ స్పెషల్స్‌తో న్యూ అల్ట్రోజ్‌ను రూపొందించినట్లు తెలిపారు. సిక్స్ ఎయిర్ బ్యాగ్స్‌తో పాటు సిఎన్‌జి, డీజిల్ వెరియంట్లలో లభిస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు 2.40 లక్షల అల్ట్రోజ్ కార్లు మార్కెట్‌లో ఉన్నాయని ఇప్పుడు వచ్చిన ఫీచర్లతో ఇంకా ఎక్కువగా మార్కెట్‌లోకి వేగంగా విస్తరిస్తుందని తెలి పారు. వెంకటరమణ మోటార్ షోరూంలో తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడై నా టెస్ట్ డ్రైవ్ చేయవచ్చునని తెలిపారు. ఎస్‌వోఎస్ కాలింగ్, వైర్ లెస్ చార్జర్, ఫ్లష్ డోర్లతో లభ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వీరేన్ చౌదరి, ఆదిత్య చౌదరి, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

# హైకోర్టులో కూనంనేని గెలుపుపై మిన్నంటిన సంబరాలు



ప్రజాపక్షం/సుజాతనగర్: కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలంగాణ హైకో ర్టులో కేసు గెలవడంపై సుజాతనగర్ మండల కేంద్రంలో సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో సంబరాలు మిన్నంటాయి. కొంత మంది కావా లని దురుద్దేశంతో వేసిన అనర్హత పిటిషన్ ను తెలంగాణ హైకోర్టు డిస్మిస్ చేసింది. ప్రజాక్షేత్రంలోనైనా గౌరవ న్యాయస్థానంలోనైనా కూనంనే నిదే గెలుపు అంటూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుజాత నగర్ మండల కేంద్రంలో సిపిఐ నాయకులు, సానుభూతిపరులు సుజాతనగర్ మండల కేంద్రానికి భారీ ఎత్తున తరలివచ్చి మెయిన్ సెంటర్లో టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి భూక్యా దస్రు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కుమారి హనుమంతరావు, జక్కుల రాములు, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, రైతు సంఘం మండల అధ్య క్షులు తాళ్లూరి ధర్మారావు, సిపిఐ నాయకులు బొడ్డ కేశవరావు, మూడు గణేష్, లావుడియా గోపి, చౌహాన్, దండు సురేష్, గద్దం రాజేందర్, నవీన్ మండే, నాగేశ్వరరావు, కుమారి, నాగేశ్వ రరావు, సిపిఐ నాయకులు, సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

# కొదుమూరు గ్రామశాఖ ఎన్నిక



ప్రజాపక్షం/ ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కొదుమూరు గ్రామశాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సోమవారం సిపిఐ కొదుమూరు గ్రామశాఖ మహాసభ నిర్వహించారు. చిట్టిమోదు కొండలరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో త్యాగాలతో ఏర్పడిన పార్టీ సిపిఐ అని తెలిపారు. ఖమ్మంజిల్లా శాఖకు కొదుమూరు గ్రామశాఖ ఉద్యమంలో ఎప్పుడు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామశాఖ నూతన కార్యదర్శిగా నీరుడు గోవిందరావు, సహాయ కార్యదర్శులు సేలం ఉపేందర్, చల్లగుండ్ల సాయి లతో పాటు 21 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూచిపూడి రవి, చింతకాని మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్, సహాయ కార్యదర్శి దూసరి గోపాలరావు, మాజీ ప్రజా ప్రతినిధులు నక్కనబోయిన సుజాత కృష్ణ, నారపోగు హేమనాగార్జున, అనుబోతు వీరబాబు, శాఖ కార్యదర్శి చల్లగుంట వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, ఆర్. వెంకటేశ్వర్లు, సారిక వెంకటేశ్వర్లు, కోటగిరి వీరయ్య, శ్రీను, వీరబాబు, వసంతరావు, చంద్రకాంత్, లింగయ్య, నాగయ్య, శ్రీను, త్రివేణి, సావిత్రి, సారిక, రాములమ్మ, ప్రమీల, పుల్లమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో పోలీస్ వాహనాన్ని పేల్చిన మావోయిస్టులు

## - ఓ ఏఎస్‌పి మృతి, సిఐ,ఎస్ఐ కి తీవ్రగాయాలు



ప్రజాపక్షం/భద్రాచలం : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్ప డ్డారు. ఏఎస్‌పితో సహా, సిఐ, ఎస్ఐ ప్రయాణిస్తున్న వాహనాన్ని మావోయిస్టులు పేల్చి వేశారు. ఈఘట నలో ఏఎస్‌పి ఆకాశ్ రావు మృతి చెందగా, సిఐ, ఎస్ఐ కూడా తీవ్ర గాయాల పాలయ్యారు. వివరాల ప్రకారం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో గొల్లపల్లి రోడ్డులో ఉన్న బేస్‌క్యాంపు సమీపంలో మావోయిస్టులు అత్యంత శక్తివంతమైన బాంబును అమర్చారు. పోలీసు వాహనం అటుగా వెళు తున్నట్లు పసిగట్టిన మావోయిస్టులు ఒక్క సారిగా బాంబు పేల్చడంతో వారివాహనం పైకి ఎగిరి పడింది. ఈ ఘటనలో ఏఎస్‌పి ఆకాశ్ రావు తీవ్ర గాయాలపాలయ్యారు. భద్రతా బలగాలు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్సలు పొందతూ ఆయన మృతి చెందారు. గాయాలపా లైన సిఐ, ఎస్ఐలను చికిత్సలు అందిస్తున్నారు. వందల సంఖ్యలో మావోయిస్టులను ఎన్‌కౌం టర్ల పేరుతో హతమారుస్తున్న భద్రతా బలగాలపై పగతో రగిలిపోతున్న మావోయిస్టులు ప్రతి కార చర్యలకు పూనుకున్నట్లు భావిస్తున్నారు.

# బిఎల్ఓలకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు మం జూరు చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఐటిడిఏ పిఓ, అదనపు కలెక్టర్లతో సమీక్ష చేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1200లకు పైగా ఓటర్లు ఉన్నచోట కొత్తగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఇది 1500 మందికి ఉండేదని చెప్పా రు.ఇందుకు ప్రతిపాదనల జాబితా సిద్ధం చేసి 20వ తేదినాటికి పంపాలని సూచించారు. ఈ నెల 15వ తేదీ లోపు తమ కు వివరాలు సమ ర్పించాలని , 25లోపు బిఎల్ఓలకు గుర్తింపు కార్డులు అందజేయా లన్నారు.ఐటిడిఏ ప్రాజె క్టు అధికారి బి రాహు ల్, అదనపు కలెక్టర వేణు గోపాలరావు, స్థాని క సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన పాల్గొన్నారు.

# విద్యార్థులకు మార్గదర్శిగా నిలవడం అభినందనీయం : ఐటిడిఏ పిఓ



ప్రజాపక్షం/భద్రాచలం : నిరుపేద ఆదివాసీ కుటుంబంలో జన్మించి ఉస్మానియా యూనివర్సి టిలో బిఏలు సీటు సంపాదించిన వైశాలి రెడ్డి తోటి విద్యార్థులకు స్ఫూర్తి దాయకమని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. సోమవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో అశ్వారావు పేట మండలం బండారు గుంపు గ్రామానికి చెందిన వైశాలిరెడ్డి చదువులకై హాస్టల్ ఫీజు విడతల వారీగా చెల్లించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా బిఏ ద్వితీయ సం. పూర్తయినందున మిగిలిన హాస్టల్ ఫీజు రూ.19280 చెక్కును పిఓ తన చేతుల మీదుగా అందజేశారు. అనంతరం బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులను అభినందిస్తూ ఖాళీ సమయాల్లో క్రింది తరగతులు వారు చదువుల పట్ల మక్కువ పెంచుకునేలా ప్రయత్నం చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, డిడి మణెమ్మ, ఈఈ హరీష్, బాలిక తల్లి తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ నాటికి ఇందిరా మహిళా శక్తి భవనాలు పూర్తి కావాలి



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : నవంబర్ నెలాఖరు నాటికి మహిళా శక్తి భవనాలు పూర్తి కావాలని పంచాయితీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖా మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. హైదరాబాద్ నుండి సిఎస్ కె రామకృష్ణారావుతో కలిసి వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ప్లాంట్లకు అనువైన భూములు పదిరోజుల్లో గుర్తించాలన్నారు. జూన్ 12న పండుగ వాతావరణంలో పాఠశాలలు పునఃప్రారంభించాలన్నారు. కోటి మందిని లక్షాధికారులను చేయాలనే ఉద్దేశ్యంతో మహిళలను ప్రోత్సహిస్తున్నామని, ఇందులో భాగంగా పెట్రోల్ పంపులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పేదరికం అధికంగా ఉండే చోట మహిళా సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు.

# కొత్తగూడెంలో మిన్నంటిన సిపిఐ శ్రేణుల సంబురాలు

- ఎంఎల్‌ఏ కూనంనేనిపై వేసిన అనర్హత పిటీషన్ డిస్మిస్ చేసిన హైకోర్టు
- మోటార్ సైకిళ్ల ర్యాలీ, బాణాసంచా కాల్పులు







**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావుపై ప్రత్యర్థి ప్రోద్భలంతో ఓ వ్యక్తి వేసిన అనర్హత పిటీషన్‌ను ఏడాదిన్నర నిరీక్షణ అనంతరం గౌరవ తెలంగాణ హై కోర్టు సోమవారం డిస్మస్ చేసింది. అనర్హత పిటీషన్ డిస్మస్ కావడంతో నియోజకవర్గంలోని సిపిఐ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. స్థానిక జిల్లా సిపిఐ కార్యాలయం శేషగిరిభవన్ నుండి మోటార్ సైకిళ్లతో భారీర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటర్లలో బాణాసంచా పేల్చి ఆనందాన్ని చాటుకున్నారు. ర్యాలీ సందర్భంగా సెంటర్లలో జరిగిన సభల్లో నాయకులు మాట్లాడుతూ దొడ్డిదారిన అందలం ఎక్కుదామనుకున్న ప్రత్యర్థులకు గౌరవయ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు చెంపపెట్టు అని, ఇది ప్రజల గెలుపుగా చెప్పారు. అప్రజాస్వామిక పదవి పొందాలనుకోవడం అవివేకం అని, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవ హైకోర్టు పరిగణలోనికి తీసుకుని న్యాయమైన తీర్పు వెలువరిచిందన్నారు. కూనంనేని నేతృత్వంలో నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తున్న తరుణంలో జీర్ణించుకోలేని కొందరు అభివృద్ధిని, కూనంనేని చేస్తున్న కృషిని అడ్డుకునేందుకు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినప్పటికీ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాశి వెంకటేశ్వర్లు, చలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, మునిగడప వెంకటేశ్వర్లు, గెడ్డాడు నగేష్, భూక్యా శ్రీనివాస్, కే రత్నకుమారి, ఎక్‌కే ఫహీమ్, పాలమూరి శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, పల్లపోతు సాయి, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, యూసుఫ్, ధర్మరాజు, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణ చారి, గుత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కుట్ర పూరిత రాజకీయాలకు చెంపపెట్టు

- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావుపై వేసిన అనర్హత పిటీషన్‌ను గౌరవ హై కోర్టు డిస్మిస్ చేయడం కుట్రపూరిత రాజకీయలకు చెంపపెట్టు అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్పందిస్తూ నియోజకవర్గ ప్రజలు కూనంనేనిని ఏక పక్షంగా కోరుకున్నారని, ప్రజాస్వామ్య పద్ధతిలో గెలిచిన కూనంనేనిని అర్హుడు కాదంటూ తప్పుడు కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేసేందుకు ప్రయత్నాలు జరిగాయన్నారు. ప్రజ అభిష్టానికి విరుద్ధంగా దొడ్డిదారిన అందలం ఎక్కుదామనుకున్న వారికి కోర్టు గట్టి సమాధానం చెప్పిందన్నారు. నియోజకవర్గాభివృద్ధికి అడ్డంగులు తొలగిపోయాయని భవిష్యత్‌లో రెట్టింపు ఉత్సాహంతో కూనంనేని ప్రజలను సేవలందిస్తారని, నియోజకవర్గాన్ని సమగ్రాభివృద్ధి చేస్తారని స్పష్టం చేశారు.

# గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు ఐటిడిఏలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు కృషి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. సోమవారం వివిధ ప్రాంతాల నుండి గిరిజన దర్భారుకు వచ్చిన గిరిజనుల నుండి ఆయన విన్నపాలు స్వీకరించారు. పరిశీలించిన అనంతరం వాటిని ఆయా శాఖల అధికారులకు బట్వాడా చేశారు. ఈసందర్భంగా పిఓ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తులు అధికారులు పరిశీలించి పరిష్కరించాలని, పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్ర వివేదిక అందించాలన్నారు. స్వయం ఉపాధి కోసం మాత్రమే గిరిజనులు దరఖాస్తులు సమర్పించాలని, అందుకు సంబంధించిన అన్ని రకాల జిరాక్సు కాపీలు దరఖాస్తుతో ఉంచాలన్నారు. పోడుభూములు, బోర్లు, చదువులు, ఇసుక సొసైటీలు, దీర్ఘ కాలిక వ్యాదులకు వైద్యం తదితరాలపై దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్‌తో పాటు డిడి మణెమ్మ, ఎస్‌డిసి రవీంద్రనాద్, ఇఇ హరీష్, ఎస్ఓ భాస్కర్, ఏఓ సున్నం రాంబాబుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

- అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు



**ప్రజాపక్షం/భద్రాచలం :** దివ్యాంగులు అన్ని రంగాల్లో రానించాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణగోపాలరావు అన్నారు. సోమవారం పాత కొత్తగూడెంలోని తెలంగాణ స్కూల్ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన హాజరై దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందజేశారు. జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా అధఅయక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల దినచర్యలో భాగంగా ఈ సహాయ ఉపకరణాలు ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వం అందజేసే సంంక్షేమ పథకాలను నియమైన అర్హులకు అందజేయాలని సూచించారు. గత అక్టోబర్ నెల్లో జిలాల్లోని గుండాల, భద్రాచలం, అశ్వారావుపేట, పాల్వంచ ఐడిఓసిలో సహాయ ఉపకరణాల పంపిణీ జరిగిందని, ఎంపికైనా 440 మంది దివ్యాంగులలకు 1057 మందికి రూ.1.11 కోట్ల ఖర్చుతో సహాయ ఉపకరణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. లబ్దిదారులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు, వీల్ చైర్స్, వినికిడి యంత్రాలు, సిపి చైర్స్, చంక కర్రలు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఓ నాగలక్ష్మి , డిఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, సిడిపిఓ పద్మశ్రీ, ఐఇడి శ్రీరాం, టివిపిఎస్ అధ్యక్షులు సతీష్, డిసిపిఓ హరికుమారి, సఖి అడ్మిన్ శుభశ్రీ, హబ్ కో ఆర్డినేటర్ రూప, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ సందీప్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, కార్యాలయ సిబ్బంది, వరప్రసాద్, నరేష్, ప్రవీణ్, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందిని కాంగ్రెస్ పార్టీ భైరవునిపల్లి గ్రామ అధ్యక్షుడు గోళ్ల శ్రీనివాస్ రావు అన్నారు. సోమవారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గు పోసి పూజా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని తెలిపారు. అర్హత గల ప్రతి ఒక్కరి కి సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు ను శర వేగంగా పూర్తి చేయాలి అని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మరికంటి రమేష్, గండు సైదులు,మల్లెబోయిన శ్రీనివాస్ రావు, నూక నాగయ్య, సిపిఐ నాయకులు కనకబండి సీతారాములు, పోలంపల్లి నారాయణ, ఆలేటి మహేష్, కుంచం భిక్షం, కనకబండి రామయ్య, చల్లా అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిజం గెలిచింది.. కోర్టులో నిరూపనయ్యింది





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నిజం గెలిచింది. ఆ విషయం కోర్టులో నిరూపణ అయ్యిందని, ప్రజా తీర్పును అపహాస్యం పాలు చేద్దామని కొందరు స్వార్థపురులు ప్రయత్నించి కోర్టు తీర్పుతో భంగపడ్డారని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం హర్షం వ్యక్తం చేశారు. ఆలస్యమైనా ధర్మమే ఎప్పటికైనా గెలుస్తుందన్నారు. కొత్తగూడెంకు చెందిన అగర్వాల్ ఎంఎల్‌ఏ కూనంనేనిపై వేసిన అనర్హత పిటీషన్‌ను గౌరవ హై కోర్టు సోమవారం డిస్మస్ చేయడంతో పాల్వంచలో సిపిఐ శ్రేణులు చేసిన సంబురాలు అంబరాన్నంటాయి. పాల్వంచలోని చంద్రా రాజేశ్వరరావు భవన్ నుండి పాల్వంచ పట్టణంలోని ప్రధాన కూడలి వరకు టపాసులు కాలుస్తూ ప్రదర్శన నిర్వహించారు. కూనంనేనికి అనుకూలంగా తీర్పు వెలువడటంతో తమ ఆనందాన్ని ప్రజలతో పంచుకున్నారు. కూనంనేని జిందాబాద్, సిపిఐ జిందాబాద్ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ఎర్రజండాలతో ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబా, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉపుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబు, మన్నెం వెంకన్న, రహమాన్ గౌస్, వైఎస్ గిరి, వేముల రాజశేఖర్, కోరె కృష్ణ, రామారావు, సర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని సందర్శించిన డిప్యూటీ సిఎం భట్టి, మహేష్‌కుమార్ గౌడ్, పొన్నం



**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎన్ని అడ్డంకులు సృష్టించాలని ప్రతిపక్షాలు చూసినా కుల గణనను నిష్పాక్షపాతంగా ఎటువంటి తప్పులు లేకుండా శాస్త్రీయబద్ధంగా పూర్తి చేసినట్లు వారు తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు విద్య, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ కల్పించేవిధంగా బిల్లులు ఆమోదించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అందరికి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. సామాజిక న్యాయం పాటిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల సంస్థ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, కిసాన్ సెల్ అధ్యక్షులు మొక్కా శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.